

**సోమశిలలో 7.766 టీఎంసీల నీరు**
సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 7.766 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ల (10 గ్రాములు) | రూ.75,580 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా) | రూ.6,769 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.6,972 |
| నవర (8 గ్రాములు) | రూ.55,776 |



**అన్నదాతకు విత్తన భరోసా**
లింగసముద్రం మండలం చినపవని వద్ద అపరాలు, చిరుధాన్యాల పరిశోధన కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ మేలు రకం విత్తనాలను అభివృద్ధి చేస్తున్నారు. 10లో

## న్యూస్‌రీల్

### ఈవీఎంలకు పటిష్ట భద్రత



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి ఆయన కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూంల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్లు, ఎస్పీలు ప్రతి రోజు సందర్శించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

### పోస్టల్ బ్యాలెట్‌లు స్ట్రాంగ్‌రూంలో భద్రం



స్ట్రాంగ్‌రూంకు తాళాలు వేయిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఉంచి సీలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కవర్లను పోస్టల్ సిబ్బంది కలెక్టర్ ఎం హరినారాయణన్‌కు అందజేయగా వాటిని ట్రంకు పెట్టెలో భద్రపరిచి సీలు వేశారు. అనంతరం స్ట్రాంగ్‌రూంలో బాక్సులను ఉంచి తాళాలు వేసి సీలు వేశారు. సీల్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతకం చేశారు. స్ట్రాంగ్‌రూం వద్ద రిజిస్టర్‌లో కలెక్టర్, ప్రజాప్రతినిధులు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ బాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి విద్యాధర్, టీడీపీ ప్రతినిధి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

### హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా ప్రత్యేకాధికారిగా జయరామాచారి

నెల్లూరు(అర్బన్): నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా పేదలకు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించేందుకు నెల్లూరు జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా జయరామాచారిని ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ విజయవాడ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఇక మీదట జిల్లాలో మానిటరింగ్ చేయనున్నారు.

### యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న కొండయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండయ్య తెలిపారు. నగరంలోని పొగతోటలో ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు నియోజకవర్గ పరిధిలో 475కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. నగరంలోని అపోలో ఆస్పత్రి వద్ద ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి అర్హులైన విద్యార్థులు మార్కుల జాబితా జెరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ముందుగా తమ పేర్లను 97058 00794, 95731 05305 నంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మహేష్, రామచంద్రయ్య, హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఆమే' కీలకం



**ఓటింగ్‌లో మహిళలదే పైచేయి**
- ఉదయగిరి తప్ప అన్ని చోట్ల మహిళా ఓటింగ్ ఎక్కువ
- అన్ని నియోజకవర్గాల్లో ఓటు వేసిన నారీమణులు 6,93,245
- పురుషుల కంటే అధికంగా 19,064 మంది మహిళల ఓటింగ్

ఉదయగిరి: అవనిలో పురుషుల కంటే దేనిలో తీసిపోని మహిళలు.. పోలింగ్‌లో కూడా పురుషుల కంటే మేము ఏమీ తక్కువ కాదని జిల్లా మహిళలు నిరూపించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లను సరిచూస్తే నారీమణులదే పైచేయిగా ఉంది. ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో పురుషుల కంటే చాలా ముందంజలో ఉన్నారు. నెల్లూరు లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో 19,11,403 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 9,36,252, స్త్రీలు 9,75,411 మంది ఉన్నారు. జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో స్త్రీలు 6,93,245 మంది ఉన్నారు. పురుషుల కంటే 19,064 మంది స్త్రీలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో పోలైన ఓట్ల తీరును పరిశీలిస్తే.. పురుషుల కంటే స్త్రీలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఓట్లు చాలా స్వల్పంగా ఉన్నప్పటికి అభ్యర్థుల విజయావకాశాలు మహిళా ఓటర్లపై ఆధారపడి ఉన్నాయి.

**కూటమిలో గుబులు**

ఈ ఐదేళ్లలో సీఎం జగన్ మహిళా సాధికారత దిశగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల జీవన ప్రమాణాలు బాగా పెరిగాయి. దీంతో ప్రభుత్వంపై మహిళల్లో సానుకూలత బాగా పెరిగింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఓటర్లు ఇంటి గడప దాటి గంటలు కొద్ది క్యూలో నిలబడి కసిగా ఓటు వేశారు. ఈ పరిణామం కూటమి గూడులో గుబులు పెడుతోంది. మహిళా ఓటర్లు ఎక్కడ తమ కొంప ముంచుతారో అనే భయం టీడీపీ అభ్యర్థులను వెంటాడుతోంది.

**పెరిగిన మహిళా ఓటింగ్ శాతం**

కొత్త జిల్లాలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో కోవూరు నుంచి అత్యధికంగా పురుష ఓటర్ల కంటే మహిళలు అదనంగా 5791 ఓట్లు వేశారు. ఆ తర్వాత స్థానం నెల్లూరు రూరల్‌లో 4308 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయగిరిలో మాత్రం మహిళల కంటే పురుషులే అదనంగా 859 మంది ఓటు వేశారు. కందుకూరులో 1,161 మంది, ఆత్మకూరులో 2,120 మంది, కావలిలో 2,224 మంది, నెల్లూరు సిటీలో 2891 మంది మహిళలు పురుషుల కంటే అదనంగా తమ ఓటు వేశారు. ముఖాముఖి పోటీ జరిగే చోట్ల మహిళల ఓట్లు 'కీ' రోల్ పోషించనున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం వైఎస్సార్‌సీపీకి మహిళా ఓటు బ్యాంకు చాలా దృఢంగా ఉంది. ఈ నేపథ్యంలో మహిళ ఓటు అధికంగా ఉండటం అధికార పార్టీ అభ్యర్థులకు కలిసివచ్చే అవకాశం ఉంది.

**బూత్‌ల వారీగా విశ్లేషణ**

ఎన్నికలు ముగిసిన క్రమంలో గెలుపు ఓటములపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. బూత్‌ల వారీగా పోలైన ఓట్లు అభ్యర్థులు సమీక్షిస్తూ ఏ పార్టీకి ప్రయోజనం ఎంత ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. గత రెండు నెలలుగా క్షణం తీరకలేకుండా ఎన్నికల ప్రక్రియలో ఉన్న పార్టీ అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ప్రస్తుతం కాస్త రిలాక్స్ అవుతున్నారు. అప్పుడే కొంతమంది విహార యాత్రలకు బయలు దేరారు. ఎవరిని విజయం వరిస్తుందో... ఎవరిపై ఓటర్లు కసిగా ఉన్నారో అనే విషయం జూన్ 4న తెలుస్తుంది.

| అసెంబ్లీ | పో.ఓ | పురుషులు | మహిళలు |
|---|---|---|---|
| కందుకూరు | 2,03,637 | 1,01,233 | 1,02,394 |
| ఆత్మకూరు | 1,79,829 | 88,854 | 90,974 |
| ఉదయగిరి | 1,97,971 | 99,413 | 98,544 |
| నెల్లూరు రూరల్ | 1,90,324 | 93,005 | 97,313 |
| కోవూరు | 2,11,976 | 1,03,088 | 1,08,879 |
| నెల్లూరు సిటీ | 1,71,763 | 84,423 | 87,314 |
| కావలి | 1,98,066 | 97,916 | 1,00,140 |

# కార్పొరేట్‌ను తలదన్నేలా..

- డిజిటల్ విద్యకు తొలి విడతలో 448 పాఠశాలల ఎంపిక
- 1324 ఐఎఫ్‌పీ, 428 స్మార్ట్ టీవీల ఏర్పాటు
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

**నాడు- నేడుతో 2,306 పాఠశాలల్లో మౌలిక వసతులు**

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. గడిచిన నాలుగున్నరేళ్లల్లో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. పేదవర్గాలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు చేపట్టారు. నాడు–నేడు లాంటి కార్యక్రమాలు చేపట్టి కార్పొరేట్ బడులను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు–నేడుతో జిల్లాలోని మొత్తం 2,306 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. తొలి విడతలో 1059 పాఠశాలల్లో రూ.234.50 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు. ఆయా పాఠశాలల్లో అదనపు గదులు నిర్మాణం, బాలురు, బాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, రన్నింగ్ వాటర్, ప్రహరీ ఏర్పాటు, ఇంగ్లిషు ల్యాబ్, కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, పెయింటింగ్ తదితర వాటితో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో 1247 పాఠశాలలతో పాటు డైట్ కళాశాల, బీఈడీ కళాశాలలు, 108 అంగన్‌వాడీలను నాడు–నేడుకు ఎంపిక చేశారు. వీటిని రూ.466.40 కోట్లతో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నారు.

**1,92,900 మంది విద్యార్థులకు విద్యాకానుక**

జిల్లాలో 2624 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1,92,900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి విద్యాకానుక పేరుతో ప్రభుత్వం 8 రకాల వస్తువులను అందజేస్తున్నారు. విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి 3 జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్స్‌లు, టై, డిక్షనరీ, బెల్టును అందజేస్తున్నారు.

**గోరుముద్దతో పౌష్టికాహారం**

విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,583 పాఠశాలల్లో 1,81,327 మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్దను అందజేస్తున్నారు. 2228 పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వాహకులు, 61 పాఠశాలల్లో ఇస్కాన్ సంస్థ, 204 పాఠశాలల్లో అక్షయపాత్ర సంస్థ నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు కోడిగుడ్డు, చిక్కీలు, రాగిజావ అందిస్తుండటంతో పౌష్టికాహార లోపం లేకుండా ఆరోగ్యవంతులకు ఉంటున్న పరిస్థితి ఉంది.

**డిజిటల్ బోధన**

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ బోధన వైపు అడుగులు వేసింది. తొలి విడతలో 448 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలల్లో 1324 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, 428 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా 8వ తరగతి చదువుతున్న 20232 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసింది. వీరికి బైజూస్ సంస్థతో బోధన అందించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన అందించేందుకు జిల్లాలో మొత్తం 6500 మంది ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనలో శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిషు మీడియంలోనే బోధన చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 63 పాఠశాలలను సీబీఎస్‌ఈ పాఠశాలలుగా మార్పు చేశారు.



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న జలదంకి మెయిన్ పాఠశాల

**విద్యాదీవెన, వసతి దీవెనలతో**

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంసీఏ, ఎంబీఏ లాంటి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు విద్యాదీవెన ద్వారా నిర్దేశిత ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. అలాగే ఆయా విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించేందుకు ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.20 వేలు వంతున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.



**పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతులు**

పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటు చేశారు. శుద్ధినీరు, పూర్తిస్థాయిలో బెంచీలు, కుర్చీలు, సరిపడా వెలుతురు ఉంది. చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. మా పాఠశాలలో చదువుతుంటే కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్నామన్న ఫీలింగ్ మా పిల్లల్లో ఉంది. సరిపడా తరగతి గదులను ఏర్పాటు చేశారు. ఇన్ని వసతులు కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

– కృష్ణకుమారి, విద్యార్థి తల్లి, నెల్లూరు

**పౌష్టికాహారం అందిస్తున్నారు**

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో భోజనం సరిగా ఉండేది కాదు. ఇప్పుడు అందిస్తున్న అన్నం ఇంట్లో తింటున్న ఫీలింగ్ మా పిల్లల్లో ఉంది. పౌష్టికాహారం అందిస్తున్నారు. వారానికి 5రోజులు గుడ్లు, చిక్కీలు, రోజుకో వెరైటీ అన్నం పెడుతున్నారు. ప్రతిరోజు పాఠశాలలోనే అన్నం తింటున్నారు.

షేక్ సమీనా, విద్యార్థి తల్లి, నెల్లూరు

### ఓట్ల లెక్కింపునకు సన్నద్ధంగా ఉండాలి

నెల్లూరు(దర్గామిట్ట): ఓట్ల లెక్కింపునకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన శుక్రవారం వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 28లోగా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్‌ఓలకు తెలియచేయాలని, ఈ సమాచారాన్ని రాజకీయ పార్టీలకు సత్వరమే తెలపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# బాగు.. అంతర పంటల సాగు

**ఆయిల్‌పామ్, నిమ్మ, మామిడి తోటల్లో..**
- రైతులకు అదనపు ఆదాయం
- జిల్లాలో 216 హెక్టార్లలో సాగు
- ఏటేటా పెరుగుతున్న విస్తీర్ణం



బండారుపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా వేసిన కొర్రల పైరు

ఆత్మకూరు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోతున్న విషయం తెలిసిందే. దీంతో పలువురు రైతులు దీర్ఘకాలిక పంటల (పండ్ల తోటలు) సాగువైపు మళ్లారు. పండ్ల తోటల సాగులో పంట కాపుకొచ్చే వరకు పెట్టుబడులు పెడుతూ ఎదురుచూడకుండా కొందరు రైతులు అంతర పంటలు సాగు చేసి సత్ఫలితాలను పొందుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నిమ్మ, మామిడి అధికంగా సాగు అవుతుండగా, కొన్ని మండలాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్నారు. అయితే ఈ మొక్కలు నాటాక కాపుకొచ్చేసరికి సుమారు ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ కాల వ్యవధిలో ఆయా తోటల్లో అంతర పంటలుగా పత్తి, మిరప, బొప్పాయి, పెసర, పిల్లిపెసర, తదితర స్వల్పకాలిక పంటలు నాలుగేళ్లపాటు సాగు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో కొన్ని గ్రామాల్లో డిమాండ్ అధికంగా ఉన్న కొర్రలు సైతం సాగు చేస్తూ రైతులు ఆదాయాలు చూస్తున్నారు. దీంతో తోటలపై పెట్టే పెట్టుబడి అంతర పంటలతో కొంత మేర అయినా రైతుల చేతికే వస్తోంది.



అనంతసాగరం మండలంలో ఆయిల్‌పామ్ తోటల్లో మల్చింగ్ షీట్లు, డ్రిప్ ఇరిగేషన్‌తో మిరప పైరు సాగు

**సాంప్రదాయ సాగే..**

గతంలో రైతులు తాము సాగు చేస్తున్న వరి పైరు చివరి దశలో పెసర, పిల్లిపెసర, కొన్ని చోట్ల దోస గింజలు వెదజల్లడం పరిపాటి. వరి కోతల అనంతరం పెసరను ఇంటి అవసరాలకు ఉపయోగించుకుంటుండగా పిల్లిపెసర పశువుల మేపుగా ఉపయోగించడం సాధారణంగా జరిగేదే. వరిపైరులో గింజలు వెదజల్లి సాగుచేసే దోస పైరు సైతం రైతులకు కొంత ఆదాయం తెచ్చిపెడుతోంది. బండారుపల్లి, రామస్వామిపల్లి గ్రామాల్లో ఇలా దోస సాగు చేసే రైతులు నేటికీ ఉన్నారు. అయితే మామిడి, నిమ్మతోటల్లో కాపు వచ్చే వరకు వృథాగా ఉంచకుండా అంతర పంటల సాగు తో రైతులకు కొంత మేర ఆ దాయం వస్తుండడంతో ఇతర రైతులు అదే మార్గంలో పయనిస్తున్నారు.

**మల్చింగ్ షీట్లతో కలుపు నివారణ**

అంతర్ పంటల సాగుతో కలుపు అధికంగా రాకుండా ప్రధాన తోటల్లో మల్చింగ్ షీట్లు పరిచి మిరప, పత్తి లాంటి పంటలు సాగు చేస్తుండడంతో కలుపు నివారణ అవుతోంది. ఈ మల్చింగ్ షీట్ల కింద నేలపై సూర్యరస్మి సోకకపోవడంతో కలుపు మొక్కలు మొలవవు. దీంతో కలుపు నివారణ జరుగుతోంది. దీనికితోడు డ్రిప్ ఇరిగేషన్‌తో నీరు పత్తి, మిరప లాంటి పంటలకు లభిస్తోంది. మల్చింగ్ షీట్లకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది.

**పెరుగుతున్న అంతర్ పంటల సాగు**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అంతర్ పంటల సాగు క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఆత్మకూరు, వింజమూరు, చేజర్ల, అనంతసాగరం, పొదలకూరు, కలువాయి, మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాల్లో అంతర్ పంటల సాగు 216 హెక్టార్లలో ఉందని అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. అవగాహన పెంచుకుంటున్న రైతులు తోటి రైతులను చూసి తాము సాగు చేస్తున్న తోటల్లోనూ అంతర్ పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రధాన తోటలు కొంత మేర దెబ్బతిన్నా అంతర పంటల ఆదాయంతో నష్టాలు తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

**ఆదాయం ఇలా..**

అంతర్ పంటల సాగుకు మందుల పిచికారీ, తదితర వాటిపై అదనపు పెట్టుబడులు ఉండవు. తోటలకు పిచికారీ చేసే మందులే అంతర పంటలపై చేస్తే సరిపోతుంది. కొన్ని అంతర్ పంటలతో (పెసర, పిల్లిపెసర) ప్రధాన తోటలకు నత్రజని, అధికంగా అంది ఆ చెట్లు సైతం ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉంది. నత్రజని బుడిపెలు అంతర పంటల వేర్లలో ఉండడంతో అవి ప్రధాన తోటలకు సహాయకారిగా ఉంటాయి. దీంతో అదనంగా నత్రజని వేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా పెట్టుబడి తగ్గుతుంది. అదే క్రమంలో అంతర పంటల ఫలితాలు తక్కువ కాలంలోనే రైతులకు అందుతుండడంతో అది ఆదాయంగా ఉంటోంది. ఇటీవలి కాలంలో కొర్రలకు అధిక డిమాండ్ ఉండడంతో రైతులు అంతర పంటగా కొర్రలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

**కొర్రల సాగుతో ఆదాయం**



ఓ వైపు పెన్నా, మరో వైపు కొమ్మలేరు వాగు మధ్యలో ఉండే మా గ్రామానికి నీటి వసతి ఉంది. 25 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నా. ఆ పంట ఫలితం చేతికొచ్చేందుకు ఐదు సంవత్సరాలు పడుతుంది. అందుకే అంతర పంటలుగా తొలుత పత్తి సాగు చేశా. తరువాత కొర్రలు సాగు చేస్తున్నా. దీంతో ఆదాయం బాగానే ఉంది. కొర్రలకు డిమాండ్ ఉంది.

– బొమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బండారుపల్లి, ఆత్మకూరు (మం)

**అంతర పంటల సాగు పెరుగుతోంది**



దీర్ఘకాలిక తోటలు సాగు చేసే రైతులకు అంతర పంటల సాగు గురించి అవగాహన కల్పిస్తున్నాం. కొందరు రైతులు అంతర పంటలు సాగు చేస్తున్నారు. అంతర పంటల సాగుకు మల్చింగ్ షీట్లు, డ్రిప్ ఇరిగేషన్ వసతి కల్పిస్తుండడంతో రైతులకు కలుపుతీసే ఖర్చు తగ్గుతోంది. దీనివల్ల ప్రధాన తోటలు ఏపుగా పెరుగుతున్నాయి. రైతులకు రెండు విధాలా ఆదాయం సమకూరుతుంది.

– రాజశేఖర్, ఉద్యానశాఖ అధికారి (ఏడీఏ), ఆత్మకూరు

# అన్నదాతకు విత్తన భరోసా

- జిల్లాలో అపరాలు, చిరుధాన్యాల పరిశోధన కేంద్రం
- లింగసముద్రం మండలంలో 410 ఎకరాల్లో ఏర్పాటు
- మేలురకం విత్తనాల అభివృద్ధి
- ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ

ఒకప్పుడు ఆ ప్రాంతం మేలు రకం విత్తనాల ఉత్పత్తికి కేంద్రంగా ఉండేది. కాలక్రమంలో నిరుపయోగంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అపరాలు, చిరుధాన్యాల పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. నిన్నటి వరకు చిట్టడవిని తలపిస్తూ అభివృద్ధికి నోచుకోని భూములు నేడు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. సుమారు ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చిన్నపవని విత్తనాభివృద్ధి క్షేత్రం అభివృద్ధి చెంది రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు మేలు రకం విత్తనాలు సరఫరా చేసే స్థాయికి చేరింది.

కందుకూరు: లింగసముద్రం మండలం చిన పవని వద్ద ఉన్న విత్తనాభివృద్ధి క్షేత్రం పరిధిలో వందల ఎకరాల భూములు ఉండేవి. అప్పట్లో ఇక్కడ మేలు రకం ధాన్యం పండించి విత్తనాలుగా రైతులకు పంపిణీ చేసేవారు. అనంతరం కాలంలో ఆ భూములు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ఆ ప్రాంతమంతా అడవిలా మారిపోయింది. కొందరు భూములు ఆక్రమించుకుని తమ పొలాల్లోకి కలిపేసుకున్నారు. దీంతో విత్తనాభివృద్ధి క్షేత్ర భూములను కాపాడాలని, అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని దశాబ్దాల నుంచి ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఏ ప్రభుత్వం కూడా ఆ క్షేత్రం అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు.



లింగసముద్రం మండలంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం

### నాణ్యమైన విత్తనాల పంపిణీ

ఈ పరిశోధన కేంద్రం చాలా అభివృద్ధి చెందింది. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో భూములు సాగులోకి వచ్చాయి. ప్రస్తుతం నాణ్యమైన విత్తనాలు అభివృద్ధి చేసి రైతులకు అందించడమే లక్ష్యంగా పంటల సాగు చేస్తున్నాం. తదుపరి దశలో ఇక్కడే పరిశోధనలు కూడా ప్రారంభమవుతాయి. అపరాలు, చిరుధాన్యాలపై పూర్తి స్థాయిలో పరిశోధనలు చేసి కొత్త రకం విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

– నవీన్, శాస్త్రవేత్త

### వైఎస్సార్‌సీపీ హయాంలో..


నీటి వసతి ఏర్పాట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విత్తనాభివృద్ధి క్షేత్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. 2021లో ఈ భూములను బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అపరాలు, చిరుధాన్యాల పరిశోధన కేంద్రం ఏర్పాట్లు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పంటల సాగుకు అనుకూలంగా 410.30 ఎకరాల భూములను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. జంగిల్ క్లియరెన్స్ చేయడంతోపాటు కాలువలు, తూముల నిర్మాణం చేశారు. 12 బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి 60 ఎకరాల్లో డ్రిప్ అండ్ స్ప్రింక్లర్స్ అమర్చారు. పరిపాలన భవనం, సీడ్ గోదాము, థ్రెస్సింగ్ ఫ్లోర్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులు చేశారు. ఇందుకోసం సుమారు రూ.200 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### అపరాల సాగు


సాగులో ఉన్న నువ్వు పంట

అపరాలైన మినుము, కంది, పెసర, శనగ వంటి వాటితోపాటు, రాగులు, సజ్జలు, కొర్రలు, వరిగలు, ఊదలు, సామలు వంటి చిరుధాన్యాలపై కూడా పరిశోధన చేసి మేలు రకం విత్తనాలు రైతులకు సరఫరా చేయడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా వ్యవసాయ యూనివర్సిటీలు, ప్రైవేట్ పరిశోధన కేంద్రాల్లో కనుగొన్న నూతన విత్తనాలను ఇక్కడ సాగు చేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. అదే సందర్భంలో పూర్తి స్థాయిలో శాస్త్రవేత్తల నియామకం అనంతరం ఇక్కడ కొత్త రకం విత్తనాలపై పరిశోధనలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం మినుము, కంది, పెసర వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన మేలు రకం మినుము విత్తనాలు 100 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 5 క్వింటాళ్లను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సరఫరా చేశారు. వరి రైతుల కోసం జనుము సాగు చేసి ఉన్నారు. అలాగే మరో 25 క్వింటాళ్ల నువ్వు విత్తనాల ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

### లక్ష్యంగా పెట్టుకుని..


విత్తనాలకు సంబంధించిన యూనిట్

ఈ ఏడాది 300 ఎకరాల్లో పంటలు సాగు చేసి విత్తనాలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మినుము 25 ఎకరాల్లో, కంది 10 ఎకరాల్లో, పెసర 25 ఎకరాల్లో ఇలా అన్ని రకాల అపరాల సాగుకు సిద్ధమవుతున్నారు. తదుపరి దశలో చిరుధాన్యాల సాగును కూడా ప్రారంభిస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే కొత్త హైబ్రిడ్ రకం వెదురు సాగును ప్రయోగాత్మకంగా ఇక్కడ 15 ఎకరాల్లో సాగు చేశారు. ఇది నాటు రకం వెదురుతో పోలిస్తే గుబురుగా కాకుండా చక్కగా ఎత్తుగా పెరుగుతుంది. పిలకలు తక్కువగా ఉండి నాణ్యమైన కర్ర దిగుబడి వస్తుంది. ఐదేళ్లల్లో కోతకు వస్తుంది. ఇటువంటి వెదురు సాగు చేసుకోవడం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని, కావున ఇది కూడా రైతులకు పరిచయం చేస్తామని కేంద్రం అధికారులు వెల్లడిస్తున్నారు.

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న జేడీ రామలింగం

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులకు సీబీఎస్‌ఈ సిలబస్‌పై శిక్షణ జరుగుతోంది. శుక్రవారం దీనిని విద్యాశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్‌ఈ బేస్డ్ లెర్నింగ్‌ను ఐఎఫ్‌పీ ప్యానల్ల ద్వారా ఎలా బోధించాలని టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా శిక్షణ కార్యక్రమం ఇన్‌చార్జి ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ 256 మందికి నాలుగురోజులపాటు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌పీడీ కార్యాలయ ఇన్‌చార్జి శారద, జిల్లా సాల్ట్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి షకీల్, ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వరరావు, కందుకూరు ఉపవిద్యాశాఖాధికారి ప్రసాదరావు, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎన్నికల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- వేగంగా పరిష్కరించిన యంత్రాంగం

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఓటరు హెల్ప్‌లైన్‌కు 1,610 ఫిర్యాదులు, ఎన్‌జీఆర్‌ఎస్‌కు 1,791, సీ–విజిల్‌కు 907, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సెల్‌కు 433, సోషల్ మీడియాకు 3, ఇతర ఫిర్యాదులు 336, వెబ్ కంప్లైంట్స్ 41 వచ్చాయి. కలెక్టర్ నేతృత్వంలోని వివిధ బృందాలు ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేశాయి. కేవలం రెండు ఫిర్యాదులు మాత్రం ప్రస్తుతానికి పురోగతిలో ఉన్నాయి. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత రిటర్నింగ్ అధికారులకు, పోలీసు అధికారులకు పంపించి పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ మొదలైన బృందాల వాహనాలకు జీపీఎస్ సిస్టం ఏర్పాటు, చెక్‌పోస్టుల నిర్వహణ, సీసీకెమెరాల ద్వారా పర్యవేక్షణ, ఖర్చులు, సోషల్ మీడియా ప్రకటనల పరిశీలన మొదలైన ఎన్నికల కార్యకలాపాల నిర్వహణను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిర్వహించారు. పరిశీలకులు కూడా ఈ సెంటర్ పనితీరును అభినందించారు.


కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ (ఫైల్)

## జెన్కో యాష్ పైప్‌లైన్ లీకేజీ

- ఆక్వా రైతుకు రూ.12 లక్షల నష్టం

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న జెన్కో థర్మల్ పవర్ ప్లాంట్ యాష్ పైప్‌లైన్‌కు గురువారం రాత్రి లీకేజీ ఏర్పడింది. దీంతో సమీపంలోని రొయ్యల చెరువులోకి బూడిదతో కలిసిన ఉప్పునీరు భారీగా చేరి అందులోని రొయ్యలు చనిపోవడంతో సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు పోకపూడి దశయ్య పేర్కొన్నాడు. జెన్కో అధికారులు వచ్చి పరిశీలించి న్యాయం చేయకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. యాష్ పైప్‌లైన్ నుంచి వేగంగా చిమ్మడంతో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయింది. శుక్రవారం యాష్ పాండ్ ఎస్‌ఈ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నామని, రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


చనిపోయిన రొయ్యలను చూపుతున్న రైతు దశయ్య

## విద్యుదాఘాతంతో గేదె మృతి

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని కోళ్లమూడి హజరత్తయ్య అనే రైతు తన గేదెను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. గురువారం వచ్చిన గాలివానకు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయి. గేదె అటు వైపు వెళ్లగా షాక్‌కు గురై చనిపోయింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గేదె విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.





## టీడీపీ దాడులపై వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

కందుకూరు: పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేసిన దాడులు, దౌర్జన్యాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులోని వివరాల మేరకు.. కందుకూరు పట్టణంలోని బంగారమ్మగుడి వద్ద ఉన్న 138వ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ అజయ్‌పై అక్కడి టీడీపీ నాయకులు దాడి చేశారు. అతడిని బూత్‌లోంచి బయటకు లాక్కొచ్చి కొట్టారు. అలాగే టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా వెళ్లి అజయ్‌ని బెదిరించాడు. ఓగూరులో టీడీపీకి ఓటు వేయనని జయమ్మ అనే వృద్ధురాలు చెప్పడంతో ఆమెను ఇల్లు ఖాళీ చేయించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆనందపురంలో పోలింగ్‌ను పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, గణేశం గంగిరెడ్డిపై అక్కడి టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. చీఫ్ ఏజెంట్ ఫారాలను చింపివేయడమే కాకుండా బూత్ వద్దకు రాకుండా అడ్డుకున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఎన్నికల్లో టీడీపీ నాయకులు అక్రమాలకు తెరలేపారని, వీటిపై సాక్ష్యాధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్ తెలిపారు. విచారణ చేసి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడేందుకు తెలుగుదేశం నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతికదాడులకు పాల్పడ్డాయని ఆరోపించారు.

## రూ.14.24 లక్షల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని అరవిందానగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో మధుసూదనరావు, శ్రీవల్లి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీవల్లి తన కుటుంబంతో కలిసి ఈనెల 15వ తేదీన అల్లూరులోని అత్త ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని రూ.14.24 లక్షల విలువ చేసే 356 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. 16వ తేదీ ఇంటికి వచ్చిన బాధితులు చోరీ జరిగిందని గుర్తించి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జరిగిన విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. చోరీ జరిగిన ప్రాంతంతోపాటు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## కారు ఢీకొని..

- కోవూరు వాసి మృతి

ఉలవపాడు: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన రాధాకృష్ణారెడ్డి (58) గతంలో మోటార్లు విక్రయించేవాడు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఇంట్లో సక్రమంగా ఉండడంలేదు. ఊర్లు తిరుగుతున్నాడు. ఈక్రమంలో మండలానికి వచ్చాడు. రోడ్డు దాటే సమయంలో ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 సిబ్బంది సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారు ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న మినీవ్యాన్

వెంకటాచలం: ట్రాక్టర్‌ను బ్రాయిలర్ కోళ్ల లోడుతో వెళ్తున్న మినీవ్యాన్ ఢీకొన్న ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శుక్రవారం జరిగింది. సర్వేపల్లి వైపు వెళ్తున్న మినీవ్యాన్ ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీవ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొన్ని కోళ్లు మృతిచెందాయి.

### నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.35
పండ్లు : రూ.25

### పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) : | 172 |
| లేయర్ (లైవ్) : | 110 |
| బ్రాయిలర్ చికెన్ : | 300 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ : | 330 |
| లేయర్ చికెన్ : | 187 |





**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.